

కంటి వైద్యుడి అదృశ్యంపై వీడిన మిస్టరీ

- 17 పేజీల సూసైడ్ నోట్ రాసి అదృశ్యమైన వైద్యుడు క్షేమం
- సూసైడ్ నోట్‌లో తెలిపినవి అవాస్తవం: పోలీసులు
- మహబూబ్‌నగర్‌కు వస్తున్న క్రమంలో రమేష్‌నాయక్ అదుపులోకి..

6

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపే.. లక్ష్యం



ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్న డీడీఆర్‌పీల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంవో దుంకుడు శ్రీనివాస్

- ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు ఉపాధ్యాయులకు శిక్షణ
- జిల్లాలో పది కేంద్రాల ఏర్పాటు
- సైన్స్, సోషల్, గణితం, ఇంగ్లిష్ టీచర్లకు..

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు జిల్లాలోని ఉపాధ్యాయులకు ఎస్‌సీఈఆర్‌టీ ఆదేశానుసారం శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల స్కూల్ అసిస్టెంట్ భౌతిక శాస్త్రం, సాంఘిక శాస్త్రం, గణితం, ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. అందుకోసం జిల్లాలో 10 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 10 మంది డీడీఆర్పీలకు ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ నెల 13 నుంచి 15 వరకు ఎ బుక్ ఆన్ డిజిటల్ లర్నింగ్ అంశంపై భౌతిక శాస్త్రం, గణితం ఉపాధ్యాయులకు, కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమంలో భాగంగా డిసిజన్ థింకింగ్ అండ్ డిజిటల్ సిటిజన్‌షిప్‌పై ఈ నెల 16 నుంచి 18 వరకు సాంఘిక శాస్త్రం, ఇంగ్లిష్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు.

భౌతిక శాస్త్రం, గణితం శిక్షణ కేంద్రాలు..

ఎ బుక్ ఆన్ డిజిటల్ లర్నింగ్‌పై ఈ నెల 13 నుంచి 15 వరకు శిక్షణ ఇచ్చేందుకు పది కేంద్రాలను ఎంపిక చేశారు. అడ్డాకుల, మూసాపేట మండలాల ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేముల, భూత్పూర్, కౌకుంట్లకు సంబంధించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భూత్పూర్, దేవరకద్ర, సీసీకుంటకు సంబంధించి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల దేవరకద్రలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జడ్చర్ల, మిడ్జిల్‌కు సంబంధించి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల బాదేపల్లి, మహబూబ్‌నగర్ రూరల్, హన్వాడకు సంబంధించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గాజులపేట, గండీడ్, మహమ్మదాబాద్‌కు సంబంధించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గండీడ్, బాలానగర్, రాజాపూర్ మండలాలకు సంబంధించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజాపూర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. కోయిలకొండ మండలంలోని ఉపాధ్యాయులకు కోయిలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నవాబ్‌పేటకు సంబంధించి నవాబ్‌పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహబూబ్‌నగర్ అర్బన్ మండలానికి సంబంధించి మహబూబ్‌నగర్ డైట్ కళాశాలలో, ఆల్ ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు మహబూబ్‌నగర్‌లోని డైట్ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నారు. మండలాల్లో ఇచ్చే శిక్షణను సంబంధిత మండల విద్యాశాఖ అధికారులు, డైట్ కళాశాలలో ఇచ్చే శిక్షణను డీఈవో పర్యవేక్షిస్తారు.

శిక్షణకు అందరూ హాజరు కావాలి

ఎస్‌ఈఆర్‌టీ ఆదేశాల మేరకు సబ్జెక్టు వారీగా ఇచ్చే శిక్షణకు ఉపాధ్యాయులకు తప్పని సరిగా హాజరు కావాలి. ఎవరికీ మినహాయింపు ఉండదు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఈ శిక్షణ ఇవ్వాలని ఉన్నతాధికారుల ఆదేశాలు ఇచ్చారు.

- దుంకుడు శ్రీనివాస్ ఏఎంవో

సాంఘిక శాస్త్రం..

సాంఘిక శాస్త్రం సబ్జెక్టు శిక్షణను 16, 17 తేదీల్లో జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ ఉర్దూ మీడియం పాఠశాలలో ఇస్తారు. మొదటి రోజు అడ్డాకుల, కోయిలకొండ, మహబూబ్‌నగర్ అర్బన్, మహబూబ్‌నగర్ రూరల్, మహమ్మదాబాద్, మూసాపేట, నవాబ్‌పేట, రాజపూర్ మండలాల ఉపాధ్యాయులకు, రెండో రోజు బాలానగర్, భూత్పూర్, సీసీకుంట, దేవరకద్ర, గండీడ్, హన్వాడ, జడ్చర్ల, కోయిలకొండ, మిడ్జిల్ మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణను ఆ పాఠశాల జీహెచ్‌ఎం పర్యవేక్షిస్తారు.

ఇంగ్లిష్..

ఇంగ్లిష్ శిక్షణను 16, 17, 18 తేదీల్లో జిల్లా కేంద్రంలోని మాడల్ బేసిక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇస్తారు. మొదటి రోజు బాలానగర్, భూత్పూర్, సీసీకుంట, దేవరకద్ర, గండీడ్, హన్వాడ మండలాల ఉపాధ్యాయులకు, రెండో రోజు అడ్డాకుల, మూసాపేట, మహబూబ్‌నగర్ అర్బన్, నవాబ్‌పేట, రాజాపూర్, మూడో రోజు జడ్చర్ల, కోయిలకొండ, కౌకుంట్ల, మహబూబ్‌నగర్ రూరల్, మిడ్జిల్, మహమ్మదాబాద్ మండలాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. శిక్షణను ఆ పాఠశాల జీహెచ్‌ఎం పర్యవేక్షిస్తారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి

ఆశావహులు.. దరఖాస్తు చేసుకోండి

- ఏఐసీసీ పరిశీలకుడు నారాయణస్వామి

నారాయణపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపిక కోసం అభిప్రాయ సేకరణలో భాగంగా నారాయణపేటకు వచ్చామని, ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని ఏఐసీసీ పరిశీలకుడు, ఎమ్మెల్సీ నారాయణస్వామి అన్నారు. సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం నారాయణపేట సీవీఆర్ బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మూడు రోజులు అందుబాటులో ఉండి నియోజకవర్గాల వారీగా నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరిస్తామన్నారు. ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని, ఆరుగురి పేర్లను ఈనెల 22న ఏఐసీసీకి అందిస్తామని చెప్పారు. అంతకు ముందు పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి అధ్యక్షతన బ్లాక్, మండల, సీనియర్‌నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు లభిస్తుందని నారాయణ స్వామి, కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి, ఫిషరీష్ చైర్మన్ సాయికుమార్, పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి పాల్గొన్నారు.

మిగిలింది.. 6 రోజులే!



టెండరు దాఖలు చేస్తున్న ఆశావహులు

- మద్యం టెండర్లకు ముంచుకొస్తున్న గడువు
- టార్గెట్ 10 వేల దరఖాస్తులు ఇప్పటివరకు వచ్చింది 270
- సోమవారం నుంచి ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు
- గతం కన్నా పెరుగుతాయన్న ధీమాలో ఎక్సైజ్‌శాఖ

మహబూబ్‌నగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్యం టెండర్లకు మరో ఆరు రోజుల గడువు మాత్రమే ఉంది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ ప్రారంభమై 15 రోజులు దాటుతున్నా టెండర్లు వేయడానికి వ్యాపారులు అంతగా ఆసక్తి చూపలేదు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలోని 227 మద్యం దుకాణాలకుగాను 280 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. అందులో శనివారం ఒక్కరోజే 131 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం నుంచి దరఖాస్తులు గణనీయంగా పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు. దాంతో అన్ని జిల్లాల్లో ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతోంది. మంచి రోజు, అదృష్ట జాతకులను వెతుక్కునే పనిలో వ్యా పారులు ఉన్నారు. అదృష్టం కలిసి వచ్చే మహిళల పేరిట కూడా టెండర్లు వేస్తున్నారు. 2023లో ఉమ్మడి జిల్లాలో 8,595 దరఖాస్తులు రాగా.. ఈసారి 10 వేలు వస్తాయని అంచనా వేస్తున్నారు. అదే జరిగితే దరఖాస్తుల రూపంలోనే ప్రభుత్వానికి రూ.300 కోట్ల ఆదాయం సమకూరనుంది.

వనపర్తి, గద్వాలలో మందకొడిగా..

వనపర్తి, జోగుళాంబ గద్వాల జిల్లాల్లో టెండర్ల ప్రక్రియ మందకొడిగా సాగుతుండగా, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలో పుంజుకుంటున్నాయి. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిధిలో 90 మద్యం దుకాణాలకు గాను 118 దరఖాస్తులు రాగా, నాగర్‌కర్నూల్ జిల్లాలోని 67 దుకాణాలకు 87 దరఖాస్తులు, వనపర్తి జిల్లాలోని 36 దకాణాలకు 20, గద్వాల జిల్లాలోని 34 దుకాణాలకు 55 దరఖాస్తులు వచ్చాయి.

ఎన్నికలు ఆగిపోవడంతో

బీసీ రేజర్వేషన్ల అంశంపై కోర్టు ఆరు వారాలు స్టే ఇచ్చినందున ఇక ఎన్నికలు డిసెంబరులోనే జరిగే అవకాశం ఉంది. ఇదివరకు షెడ్యూల్ ప్రకారం అయితే స్థానిక ఎన్నికలు, మద్యం టెండర్లు రెండు ఒకే సమయంలో ఉండటంతో చాలామంది ఆశావహులు టెండర్లపై నిరాసక్తి చూపారు. ఇప్పుడు ఎన్నికలకు సమయంలో ఉండటంతో పోటీ చేద్దామనుకునే ద్వితీయశ్రేణి నాయకులుంతా మద్యం టెండర్లలో అదృష్టాన్ని పరీక్షించుకునే అవకాశం ఉంది.

గతంకన్నా పెరుగుతాయి

ఎప్పుడైనా చివరి మూడు, నాలుగు రోజుల్లోనే అధిక సంఖ్యలో టెండర్లు వేస్తారు. ఇప్పుడూ అదే జరుగనుంది. ఇప్పటికే చాలా మంది దరఖాస్తు ఫారాలు తీసుకెళ్లారు. 2023లో మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల పరిధిలో 3,575 టెండర్లు రాగా ఈసారి 4 వేలు దాటే అవకాశం ఉంది.

- మహబూబ్‌నగర్, ఎక్సైజ్ ఈఎస్ సుధాకర్‌గౌడ్



మాట్లాడుతున్న ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి

నైపుణ్యాలను పెంచుకోవాలి

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి

పాలమూరు యూనివర్సిటీ , అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): యువకులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టా రెడ్డి అన్నారు. శనివారం పీయూలోని ఫార్మసీ ఆడిటోరియంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. బాలకిష్టా రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, నిరుద్యోగులు-ఉపాధి అవకాశాలు-నైపుణ్యాభివృద్ధి గురించి ప్రసంగించారు. ప్రస్తుతం ప్రపంచంలో కెల్లా భారతదేశంలో తెలంగాణ ఫార్మ కంపెనీలు మొదటి స్థానంలో ఉండి, ఎందరికో ఉద్యోగాలు కల్పిస్తున్నాయని అన్నారు. పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ పీయూ పరిధిలో చాలామంచి నైపుణ్యాలు కలిగిన నిరుద్యోగులు ఉన్నారన్నారు. వారు ఇలాంటి అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. రాష్ట్రంలో ఉన్నత విద్యామండలి ద్వారా మెగా జాబ్‌మేళా నిర్వహించడం మొదటిసారి అని, అందుకు చైర్మన్ బాలకిష్టా రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బల్క్ డ్రగ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రోజారాణి మాట్లాడుతూ ప్లేస్మెంట్ డ్రైవ్‌కి వచ్చిన 8 కంపెనీలకు గాను 6 కంపెనీలు డైరెక్ట్‌గా ఉద్యోగాలు కల్పిస్తున్నాయన్నారు. 2 కంపెనీలు మూడు నెలలు స్టైఫండ్ ఇస్తూ ట్రైనింగ్ పిరియడ్‌లో ప్రతిభ ఆధారంగా ప్లేస్మెంట్ ఇస్తాయన్నారు. 320 ఉద్యోగాలకు 145 మంది నిరుద్యోగులు మాత్రమే హాజరయ్యారని, ఎంపికైన వారిని త్వరలో ప్రకటిస్తామని పీయూ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎన్ అర్జున్ కుమార్ తెలిపారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పండుగ

- ఉమ్మడి జిల్లాలో ఒక జాతీయ, ఎనిమిది రాష్ట్ర స్థాయి టోర్నీలకు ఆతిథ్యం
- రాజాపూర్‌లో 18 నుంచి స్టేట్ వాలీబాల్ టోర్నీ

7

రైతు సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

- పాలమూరు ఎంపీ డీకే అరుణ
- ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన పీఎం

నారాయణపేట రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. అందుకే వెనుకబడిన జిల్లాలను ఎంపిక చేసి, ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శనివారం ప్రారంభించారని చెప్పారు. నారాయణపేట జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పేట మండలం జాజాపూర్ గ్రామ రైతు వేదికలో ప్రధాని వర్చువల్‌గా పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అరుణ ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. తెలంగాణలో ఈపథకం కింద నాలుగు జిల్లాలు ఎంపిక కాగా, అందులో ఉమ్మడి పాలమూరులోనే మూడు జిల్లాలు నాగర్‌కర్నూల్, గద్వాల, నారాయణపేట ఉండటం గర్వకారణమన్నారు. ఈ ప్రాంత రైతులు ఆర్థికంగా ఎదగాలనే ఆకాంక్షతో ప్రవేశపెట్టిన ఈ పథకం ఆరేళ్లపాటు కొనసాగుతుందన్నారు. ఏటా ఈపథకం కోసం కేంద్రం రూ.960 కోట్ల నిధులను మంజూరు చేస్తుందని తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల, రైతు సంఘాలను ఏర్పాటు చేసుకుంటే సబ్సిడీ రుణాలు వస్తాయన్నారు. పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ఇందులో వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖకు సంబంధించి 29 పథకాలు ఉంటాయన్నారు. పథకానికి యాక్షన్ ప్లాన్ తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, నోడల్ అధికారి సాయిబాబా, జిల్లా వ్యవసాయాధికారి జాన్‌సుధాకర్, ఉద్యాన శాఖ అధికారులు, బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి వాకిటి శ్రీహరి

బీసీల హక్కులు కాపాడేది కాంగ్రెస్సే

- మంత్రి వాకిటి శ్రీహరి

మహబూబ్‌నగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బీసీలకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పని చేస్తుంటే బీజేపీ, బీఆర్‌ఎస్‌లు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్రౌన్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో మైత్రి యాదయ్య, సాయిలు యాదవ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు అధిక సంఖ్యలో శనివారం కాంగ్రెస్‌లో చేరారు. మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో 42 శాతం రిజర్వేషన్ల కోసం తీర్మానం చేసి బిల్లు గవర్నర్‌కు పంపించారని, అయితే హైకోర్టు స్టే వల్ల అమలులో కొంత జా ప్యం జరిగిందన్నారు. కానీ అమలుచేసి తీరుతామన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌ల కోసం కాంగ్రెస్ అన్ని ప్రయత్నాలు చేస్తుందని, చట్టపరంగా న్యాయపరంగా ఉన్న అవరోధాలను అధిగమించేందుకు ముఖ్యమంత్రితో పాటు మం త్రులు ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహరెడ్డి, నాయకులు సంజీవ్‌ముదిరాజ్, ఏపీ మిథున్‌రెడ్డి, ఆనంద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

నీట మునిగి ఇద్దరు సోదరుల మృతి

- అడ్డాకుల మండలం బలీద్‌పల్లిలో ఘటన

7

పేటలో ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

7

భార్యాభర్తల మృతదేహాలు లభ్యం



నీటిలోంచి మృతదేహాలను తీసుకొస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది

- కిష్టారం గ్రామ సమీపంలోని పోతిరెడ్డి చెరువు
- అలుగు నీటిలో మూడు రోజుల కిందట గల్లంతు
- రూ.50 వేల ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

7

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్
నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 110.00
హోల్ సేల్	: 116.00
డ్రెస్డ్	: 191.00
స్కిన్ లెస్	: 218.00

ఉరి వేసుకొని రైతు ఆత్మహత్య

- నవాబ్‌పేట మండలం ఎర్రవాడ్కతండాలో ఘటన

7



నారాయణపేటలో ధాన్యం తూర్పు పడుతున్న యంత్రం

రైతుల కష్టాలకు చెక్

- నారాయణపేట, వనపర్తి జిల్లాలకు ఆధునిక యంత్రాలు
- ధాన్యం తూర్పు పట్టడంతో పాటు ఆరబెట్టనున్న మిషన్లు
- వరి, జొన్నలు, మొక్కజొన్నల కోసం వినియోగం

6

ఫైనల్‌కు మహబూబ్‌నగర్, నారాయణపేట జట్లు

- ట్రెడిషనల్ బాలుర విభాగంలో..
- నేడు ఫైనల్స్

6



బాలుర విభాగంలో తలపడుతున్న మహబూబ్‌నగర్, ఖమ్మం జట్లు

బీఆర్ఎస్, బీజేపీలు బీసీలకు చేసిందేంది?

» మాజీ మంత్రి జే చిత్తరంజన్‌దాస్



కల్వకుర్తిలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్

కల్వకుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్, బీజేపీలు బీసీలకు చేసింది ఏందో చెప్పాలని మాజీ మంత్రి జే చిత్తరంజన్‌దాస్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో బీసీలకు కులగణన చేసి స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను కల్పించాలని చూస్తుంటే సహకరించాల్సిన ప్రతిపక్షాలు విమర్శించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కల్వకుర్తి పట్టణంలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ బీసీలను విస్మరించిందని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బీసీ బిల్లుకు ఎందుకు సహకరించడం లేదని ఆయన ప్రశ్నించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించడానికి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన తెలిపారు. సమావేశంలో అంజయ్యగౌడ్, లక్ష్మయ్యగౌడ్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెరుకు ఫ్యాక్టరీలో ప్రమాదం

● ఏడుగురికి గాయాలు



ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఫ్యాక్టరీ కార్మికులు

కొత్తకోట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీలో శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఏడుగురికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల మేరకు ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థ పదార్థాలను డ్రైనేజీ నుంచి తొలగిస్తుండగా కింద పడిపోయారు. ఒకరిని కాపాడడానికి మరొకరు ప్రయత్నిస్తూ ఏడుగురు డ్రైనేజిలో పడ్డారు. సమీపంలోని తోటి కార్మికులు కిందపడిన కార్మికులను చాకచక్యంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం కొత్తకోటలోని ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. గాయపడిన వారిలో జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన అనోజ్, కౌల్, దామోదర్, సనోజ్, విజయ్, పింటుతో పాటు ఆత్మకూర్ మండల ఆరెపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఉన్నారు. ఫిర్యాదు లేని కారణంగా కేసు నమోదు చేయలేదని ఎస్ఐ ఆనంద్ తెలిపారు. శనివారం హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని చెరుకు అభివృద్ధి మండలి మాజీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, బీసీ సంఘాల నాయకులు రాములు యాదవ్, భీమన్న నాయుడు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఫ్యాక్టరీ యజమాన్యాన్ని డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి



సోలీపూర్ శివారులోని కాలువలో పడి మృతి చెందిన బుపాని బోయ వెంకటయ్య

ఖిల్లాఘణపురం ,అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాలానగర్ మండలం గుండెడ్ గ్రామానికి చెందిన బుపాని బోయ వెంకటయ్య (35) మద్యం సేవించి శుక్రవారం సోలీపూర్ నుంచి రుక్కన్నపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలోని కాలువ వద్దకు మూత్ర విసర్జనకు వెళ్తున్న సమయంలో జారి కాలువలో పడి మృతి చెందాడు. సోలీపూర్ గ్రామానికి చెందిన బుపాని మణెమ్మ, గుండెడ్ గ్రామానికి చెందిన బుపాని బోయ వెంకటయ్యకు 9 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఈనెల 10వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం మృతుడు వెంకటయ్యతో కలిసి భార్య మణెమ్మ తల్లి ఊరు సోలీపూర్ గ్రామానికి వచ్చారు. మృతుడు వెంకటయ్య మద్యం తాగి బయటకు వెళ్లి మళ్లీ మద్యం సేవించాడు. కుటుంబ సభ్యులు మద్యం మత్తులో ఉన్న వెంకటయ్యను ఇంటికి తీసుకువచ్చారు. మత్తులోనే మళ్లీ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మృతుడు వెంకటయ్యను వెతికే క్రమంలో గ్రామ శివారు సోలీపూర్ నుంచి రుక్కన్నపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలో కాలువలో పడి ఉన్నాడని గ్రామస్థులు తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లి చూసేసరికి వెంకటయ్య మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య బుపాని మణెమ్మ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఆటోలో నుంచి జారి పడి వృద్ధుడు..

ఇటిక్యాల, సెప్టెంబరు 11 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండల పరిధిలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని దువాసిపల్లి గ్రామానికి చెందిన పెద్ద బీసన్న(70) తన స్వంత పనుల నిమిత్తం ఎర్రవల్లి వెళ్లి పనులు ముగించుకొని తిరిగి దువాసిపల్లికి ఆటోలో వెళ్లతున్నాడు. సాసనూల్ గ్రామసమీపంలో ప్రమాదవశాత్తు ఆటో నుంచి జారి పడితలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గద్వాల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లాలని సూచించడంతో అక్కడికి తరలించారు. అక్కడి డ్యూటీ వైద్యులు పరీక్షించి మరణించినట్లు తెలిపారని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి భార్య లచ్చమ్మ, నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మహమ్మదాబాద్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై నుంచి పడిన వ్యక్తికి గాయాలైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల సమీపంలో జరిగింది. వివరాల్లోకి శితే మండల పరిధిలోని అన్నారెడ్డిపల్లి తండా గ్రామానికి చెందిన వికాస్(21) తన ద్విచక్ర వాహనంపై సొంత పని నిమిత్తం మండల కేంద్రానికి వెళుతున్నాడు. రోడ్డుపై బైక్ అదుపు తప్పి కిందపడి ఎడమ చేయి విరగగా, ఎడమకాలికి బలమైన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారమిచ్చారు. వెంటనే 108 వాహనం అక్కడకు చేరుకొని ఈఎంటీ జానమ్మ, పైలెట్ అక్బర్‌లు క్షతగాత్రునికి ప్రథమ చికిత్స చేసి అనంతరం మహబూబ్ నగర్ లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైతుల కష్టాలకు చెక్

» ఆధునిక యంత్రాలతో తొలగనున్న ఇక్కట్లు

» వ్యవసాయ మార్కెట్‌లకు తూర్పు పట్టడం, వడ్లు ఆరబెట్టే యంత్రాలు



ఆటోమేటిక్ క్లీనింగ్ యంత్రంలో శుద్ధి చేసిన ధాన్యం ట్రాక్టర్‌లో వేస్తూ..

నారాయణపేట/పెబ్బేరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ధాన్యం శుభ్రపరిచేందుకు గాను ఆటోమేటిక్ క్లీనింగ్, డ్రయ్యర్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. వీటి వల్ల ఎలాంటి మనుషుల అవసరం లేకుండా ధాన్యం కుప్పల నుంచి పైప్ ద్వారా మిషన్ తీసుకొని హైస్పీడ్ క్లీనింగ్ యంత్రంతో ధాన్యాన్ని క్షణాల మీదుగా శుభ్రం చేస్తుంది. ధాన్యం తేమ ఉంటే డ్రై చేసేందుకు మరో డ్రై యంత్రం ద్వారా ధాన్యంలో ఉన్న తేమ లేకుండా శుద్ధి చేస్తుంది. ఈ రెండు యంత్రాలు రైతాంగానికి ఎంతగానో దోహద పడుతాయి. ఉమ్మడి జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గితో పాటు పెబ్బేరు మార్కెట్ కమిటీలకు ధాన్యం తూర్పు పట్టేందుకు 4 యంత్రాలు, వరిని ఆరబెట్టేందుకు ఒక యంత్రాన్ని అందజేసింది. సింగిల్ ఫేస్ కరెంట్‌తో పాటు డీజిల్‌తో ఈ యాంత్రాలు పనిచేస్తాయి.

తూర్పు పట్టడం, ఆరబెట్టే సమస్యలు ఇక ఉండవు

గతంతో పోల్చితే వరిసాగు భారీగా పెరిగింది. హార్వెస్టర్‌తో వరి కోసిన ధాన్యంలో తాలు, చెత్త ఉంటుంది. దీనికి తోడు వరి ధాన్యాన్ని ఆరబెటడం రైతులకు పెద్ద సమస్యగా మారింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యంలో తాలు, చెత్త ఉండడంతో పాటు తేమ శాతం లేకపోవడంతో తూకం చేయడం కోసం నిర్వాహకులు నిరాకరిస్తారు. దీంతో రైతులు తీవ్ర నిరాశ చెంది తక్కువ ధరకు ధాన్యాన్ని దళారులకు విక్రయిస్తుంటారు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం యంత్రాలను అందజేసింది. ఈ యంత్రాలను ఆయా కొనుగోలు కేంద్రాలకు అందజేసి సమస్యలను పరిష్కరించేందుకు నిర్వాహకులు కృషి చేస్తారు.

కొనుగోలు కేంద్రాలకు పంపిస్తాం



వరి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యంలో తాలు, చెత్త ఉన్న వాటిని తూర్పు పట్టే నాలుగు యంత్రాలున్నాయి. ధాన్యంలో తేమ శాతం లేకపోవడంతో వడ్లను ఆరబెట్టేందుకు (డ్రయ్యర్)యంత్రం అందుబాటులో ఉంది. ఈ యంత్రాలను ఆయా కొనుగోలు కేంద్రాలకు అందజేస్తాం. సీజన్ ఆయిపోయిన వెంటనే తిరిగి యంత్రాలను మార్కెట్ ఆవరణంలో భద్రపరుస్తాం.

\- అనీల్ కుమార్, కార్యదర్శి, వ్యవసాయ మార్కెట్, పెబ్బేరు

రైతుల సంక్షేమం కోసం సీఎం కృషి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతాంగం సంక్షేమం కోసం అధునికంగా ప్రతీ వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆధునికంగా ఉండే క్లీనర్, డ్రయ్యర్ యాంత్రాలను అందుబాటులోకి తీసుకు రావడం వల్ల రైతులకు మేలు చేకురుతుంది. మనుషల అవసరం లేకుండా యంత్రాలతో ధాన్యం శుద్ధి అయి తేమ శాతం తగ్గేలా యంత్రాలు ఉపయోగపడుతాయి. రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు వినియోగించుకోవాలి.

\- శివారెడ్డి, మార్కెట్ చైర్మన్, నారాయణపేట

ఫైనల్‌కు మహబూబ్‌నగర్, నారాయణపేట జట్లు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ శిరీషరాణి



ఫైనల్‌కు చేరిన మహబూబ్‌నగర్ జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ రసవత్తంగా కొనసాగుతున్నది. ఈ టోర్నీలో మహబూబ్‌నగర్, నారాయణపేటతో పాటు రంగారెడ్డి, నల్గొండ జట్లు ఫైనల్ బెర్తును ఖరారు చేసుకున్నాయి. శనివారం జరిగిన ట్రెడిషనల్ విభాగంలో బాలుర మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్ జట్టు 16-14 పాయింట్లతో ఖమ్మంపై, రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో నారాయణపేట జట్టు 19-17 పాయింట్లతో నల్గొండపై గెలిపొందాయి. బాలికల విభాగంలో జరిగిన మొదటి సెమీఫైనల్‌లో రంగారెడ్డి జట్టు 20-17 పాయింట్లతో నిజామాబాద్‌పై, రెండో సెమీఫైనల్‌లో నల్గొండ జట్టు 20-15తో మహబూబ్‌నగర్‌పై గెలిచాయి. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్-నారాయణపేట, బాలికల విభాగంలో రంగారెడ్డి, నల్గొండ జట్లు ఫైనల్‌కు చేరాయి.

నెట్‌బాల్ టోర్నీలో క్రీడాకారులు ప్రతిభ చాటాలి

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తిని చాటాలని రాష్ట్ర నెట్‌బాల్ అసోసియే షన్ సెక్రటరీ శిరీషరాణి అన్నారు. మహబూబ్‌నగర్ ప్రధాన స్టేడియంలో శనివారం రెండో రోజు నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలను ఆమె హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెట్‌బాల్‌లో రాష్ట్ర క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తుచేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నెట్‌బాల్‌లో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని తెలిపారు. ట్రెడిషనల్, 3వ ఫాస్ట్-5, 1వ మిక్స్‌డ్ విభాగాల్లో ఆయా జట్ల క్రీడాకారులు ప్రతిభ చాటి విజేతలుగా నిలువాలని ఆకాక్షించారు. రాష్ట్ర అధ్యక్షుడు విక్రమాదిత్యారెడ్డి, ఖాజాఖా న్, రాంమోహన్, అంజద్ అలీ, అక్రమ్, షరీఫ్ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ఖిల్లాఘణపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఖిల్లాఘణపురం మండలంలోని సోలీపూర్ గ్రామ శివారు ప్రాంతంలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న టాటా ఏసీ ట్రాలీ ఆటో వాహనాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. సోలీపూర్ గ్రామ శివారు ప్రాంతంలో శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఖిల్లాఘణపురం వైపు వస్తున టాటా ఏసీ ట్రాలీ వాహనాన్ని పోలీసులు పరిశీలించారు. వాహనంలో 40 బస్తాల (సుమారు 18 క్వింటాళ్లు) రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి పట్టుకున్నారు. ఊర్కొండ మండలం రేవల్లి గ్రామానికి చెందిన వాహన డ్రైవర్ గొడుగు కృష్ణను ప్రశ్నించగా వనపర్తిలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద రేషన్ బియ్యం కొనుగోలు చేసి తరలిస్తున్నానని తెలిపినట్లు వివరించారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



పట్టుబడిన పీడీఎస్ బియ్యంతో అధికారులు

మరికల్, (ఆంధ్రజ్యోతి): ధన్వాడ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎమినోనిపల్లి గ్రామ శివారులో శనివారం బొలెరో వాహనంలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. విచారించగా నర్వ మండలంలోని పలు గ్రామాల్లో పీడీఎస్ బియ్యం సేకరించి కర్ణాటక తీసుకెళుతున్న తిరుమలాయపల్లి గ్రామానికి చెందిన బొలెరో డ్రైవర్ నరేందర్, మక్తల్ మండలం శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన ఓనర్ బాలరాజు 15 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం తర లిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు.

డీటీ పంచనామా అనంతరం డ్రైవర్, ఓనర్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌చార్జి ఎస్ఐ సురేష్ తెలిపారు.

కంటి వైద్యుడి అదృశ్యంపై వీడిన మిస్టరీ

» 17 పేజీల సూసైడ్ నోట్ రాసి అదృశ్యమైన కంటి వైద్యుడు క్షేమం

» సూసైడ్ నోట్‌లో చేసిన ఆరోపణలు అవాస్తవం...

» మహబూబ్‌నగర్ వస్తున్న క్రమంలో పోలీసులకు దొరికిన రమేష్‌నాయక్



రమేష్‌నాయక్‌ను విలేకరుల ముందు ప్రవేశపెట్టిన పోలీసులు

మద్దూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మద్దూర్‌లో ఓ వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులపై 17 పేజీల సూసైడ్ నోట్ రాసి అదృశ్యమై కంటి వైద్యుడు ఎట్టకేలకు పోలీసులకు దొరకాడు. ఈ మేరకు శనివారం మద్దూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకురుల సమావేశంలో అదృశ్య ఘటనపై కంటి వైద్యుడు తెలిపిన వివారాలను సీఐ సైదులు, ఎస్ఐ వియ్‌కుమార్‌లు వెల్లడించారు.

మద్దూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట కంటి పరీక్ష కేంద్రాన్ని నిర్వహిస్తున్న రమేశ్‌నాయక్ మద్దూర్‌కు చెందిన తాజొద్దీన్, యాసీన్‌లపై మత విద్వేషాలు రగిలించే విధంగా పలు వివాదాస్పద, సున్నితమైన అంశాలతో కూడిన ఆరోపణలు చేస్తూ 17పేజీల సూసైడ్ నోట్ రాసిండు. తాను ట్రైన్ కింద పడి ఆత్మహత్య చేసుకోబోతున్నానని ఆ నోట్‌లో పేర్కొని తన మిత్రుల ఫోన్లకు వాట్సాప్ చేసి గత నెల 28న అదృశ్యమయాడు, కాగా, సోషల్ మీడియాలో వైరల్ అయి సంచలనంగా మారి ఆయా సంఘాల నాయకుల ఆందోళన, నిరసనలకు కారణమైంది. రమేష్ నాయక్ అదృశ్యంపై తండ్రి దామ్లా నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారం భించినట్లు సీఐ తెలిపారు. ఇందుకు మూడు బృందాలను ఏర్పాటు చేసి ఆచూకీకై వెతకసాగారు. శనివారం హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు వస్తున్న క్రమంలో తమ గాలింపు సందర్భంగా దొరికిన రమేష్‌నాయక్‌ను 17 పేజీల వివాదాస్పద సూసైట్ నోట్‌పై విచారించగా పలు విషయాలను రమేష్ నాయక్ వెల్లడించినట్లు తెలిపారు.

ఆ వివరాలిలా...

మద్దూర్‌లో ల్యాబ్‌ను కొనసాగించే తన మిత్రుడు రాంచెర్‌కు రూ.10 లక్షలు అప్పుగా ఇప్పించా. అతను వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకోగా ఆ డబ్బులు తాను చెల్లించాలని అప్పు ఇచ్చిన రిజ్వాన్ సోదరులు తాజొద్దీన్, యాసీన్‌లు ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో పాటు ఆ అప్పును తనపై బదలాయించి తన మిత్రులతో కూడా అప్పు చెల్లింపుపై చెప్పించారు. తనను ఇంత ఒత్తిడికి గురి చేసిన వారు కూడా వేరే రకంగా ఆ బాధను అనుభవించాలనే ఉద్దేశంతో వివిధ రాకాల ఆరోపణలు చేస్తూ 17 పేజీల సూసైడ్ నోట్ రాయడం జరిగిందని రమేశ్‌నాయక్ వెల్లడించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఈ విషయాన్ని విలేకరులు అడగగా సూసైడ్ నోట్‌లో చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని స్పష్టం చేశారు. రమేష్ నాయక్‌ను దొరకబట్టిన టీం బృందం సభ్యులు ఎస్ఐ విజయ్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ పురుషోత్తం, హెడ్ కానిస్టేబుల్ వాసురాంనాయక్, పుల్సా నాయక్, నాగమల్లయ్య, పరందాములు, రాఘవేందర్‌రెడ్డి, హన్మంతు, రామస్వామి, రాఘవేందర్ గౌడ్‌లను ఈ సందర్భంగా సీఐ అభినందిచారు.

చెరుకు రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

» కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతుల సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రాజన్న



ఆత్మకూరు జోన్ సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజన్న

ఆత్మకూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): చెరుకు రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతుల సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఆత్మకూరు జోన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నరేంద్రమోదీ ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు మద్ధతు ధర ప్రకటించిన మాదిరిగానే చెరుకు పంటకు కూడా మద్ధతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పత్తి పంటకు మద్ధతు ధర ప్రకటించిన మాదిరిగానే చెరుకు పంటకు టన్నుకు రూ.6వే లు ఇవ్వాలని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి క్వింటాల్‌కు 500 బోనస్ ప్రకటించిన మాదిరిగానే చెరుకు పంటకు కూడా ట న్నుకు వెయ్యి ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం సకాలంలో కటింగ్ కార్మికులను రప్పించి సీరియల్ మాదిరిగా చెరుకు పంట కటింగ్ చేసేందుకు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. చెరుకు రైతుల సంఘం నాయకులు మాసన్న, వాసారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చంద్రసేనారెడ్డి, రంగారెడ్డి, తిరుపతయ్యతో పాటు ఆయా గ్రామాల చెరుకు రైతు లు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

» కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

గద్వాల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణా ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. శనివారం శ్రీశైలం ప్రాజెక్టుకు 88,582 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ఉన్నది. ఒక గేటును ఎత్తి 27,983 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు కాలువలు, ఎత్తిపోతల ద్వారా 76,008 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 214.84 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మటి, నారాయణపూర్ ప్రాజెక్టు గేట్లు మాతపడగా విద్యుత్ ఉత్పత్తి ద్వారా 6 వేల క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నది ద్వారా మరో 50 వేల క్యూసెక్కులు జూరాల వైపు వస్తోంది. జూరాలకు ఇన్‌ఫ్లో 62 వేల క్యూసెక్కులు ఉండగా మూడు గేట్ల ద్వారా 18,384 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 45,055 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర నుంచి సుంకేసుల డ్యామ్‌కు 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 6 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

లక్ష్మారెడ్డి తల్లి దశదినకర్మలో పాల్గొన్న ప్రముఖులు



మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి తల్లి లక్ష్మమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

తిమ్మాజిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి తల్లి దశదినకర్మలో మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పలువురు జిల్లా, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొని నివాళులర్పించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ ఈనెల 1న హైదరాబాద్‌లో చనిపోవడంతో ఆమె స్వగ్రామమైన తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆవంచలో నిర్వహించిన దశదినకర్మలో మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి ఆమె చిత్ర పటానికి నివాళులర్పించి మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శించారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, యాదయ్య, శ్రీశైలం యాదవ్, మాజీ జడ్పీటీసీ దయాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు వేణుగోపాల్‌గౌడ్, అజయ్‌కుమార్, మోహనాచారి, స్వామి, ఇబ్రహీం, సైఫ్, ఉషన్న, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● తెలంగాణ విద్యామండలి చైర్మన్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి



జయప్రకాష్ నారాయణ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వి.బాలకిష్టారెడ్డి, కేఎస్ రవికుమార్ తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : లోక్‌నాయక్ భారతరత్న జయప్రకాష్ నారాయణ్ దేశంలో సాంకేతిక రంగాభివృద్ధికి ఎంతగానో కృషిచేసిన మహోన్నత వ్యక్తి అని, ఆయన సేవలు ఎన్నటికీ మరువ లేనివని తెలంగాణ విద్యామండలి చైర్మన్ డాక్టర్ వి.బాలకిష్టారెడ్డి అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని జయప్రకాష్ నారాయణ్ ఇంజనీరింగ్ కళాశాలలో 123వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కళాశాలలో గల జయప్రకాష్ నారాయణ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని చైర్మన్ కేఎస్ రవికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ప్రపంచంలో పోటీతత్వం బాగా పెరిగిందని, అవకాశాలను అంది పుచ్చుకునేందుకు విద్యార్థులు నైపుణ్యాలపై దృష్టి సాధించాలన్నారు. కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ మాట్లాడారు. కళాశాల కార్యదర్శి వెంకట రామారావు, ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.కృష్ణమూర్తి, డాక్టర్ చంద్రశేఖర్, కోటాల సందీప్‌కుమార్, పాలమూరు బ్లడ్ బ్యాంక్ కార్యదర్శి బాలయ్య, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమాచార హక్కు చట్టం కార్యక్రమంలో వి.బాలకిష్టారెడ్డి విద్యార్థులకు చట్టం గురించి వివరించారు.

క్రైం కార్నర్

గల్లంతైన భార్యాభర్తల మృతదేహాలు లభ్యం

» కిష్టారం గ్రామ సమీపంలోని పోతిరెడ్డి చెరువు అలుగు నీటిలో గల్లంతు
» మూడవ రోజు తేలిన మృతదేహాలు

జడ్చర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం కిష్టారం, అంబటాపురం గ్రామాల మధ్య దారిపైకి పోతిరెడ్డి చెరువులో నుంచి వచ్చిన అలుగు నీళ్లలో గల్లంతైన భార్యా భర్తలు తానెం బాలయ్య, తానెం రాములమ్మల మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. ఈ నెల 9న కిష్టారం గ్రామం నుంచి స్వంత గ్రామమైన అంబటాపూర్‌కు నడుచు కుంటూ వెళ్తున్న వీరు, అలుగు పారుతున్న నీటిలో గల్లంతయ్యారు. సంఘటన స్థలానికి జడ్చర్ల ఫైర్‌స్టేషన్ సిబ్బందితో పాటు జిల్లా కేంద్రంలోని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం 36గంటల పాటు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన ప్రాంతం నుంచి దాదాపు కిలోమీటరు దూరంలో భార్యాభర్తల బాలయ్య, రాములమ్మల మృతదేహలు లభ్యమయ్యాయి. మృతదేహలను నీళ్లలో నుంచి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు మైదానం ప్రాంతానికి తీసుకువచ్చారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పరామర్శ

పోతిరెడ్డిచెరువు అలుగు నీటిలో గల్లంతై మృతిచెందిన తానెం బాలయ్య, రామలుమ్మల కుటుంబ సభ్యులను శనివారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పరామర్శించారు. భారీ వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిలో గల్లంతైన భార్యాభర్తలు ఇద్దరు మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులను పరామర్శించి, రూ.50వేల ఆర్థికసహాయం అందచేశారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని, త్వరలోనే బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తిమ్మాజిపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని మద్యం డిపో సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నేరేళ్లపల్లి ఆంజనేయులు(45)అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... తిమ్మాజిపేట నుంచి బైకుపై మారేపల్లి వెళ్తున్న ఆంజనేయులును మారేపల్లికాలనీకి చెందిన కందిషోరెడ్డి తన బైకుపై వెళ్తూ అకస్మాత్తుగా రెండు బైకులు ఢీకొట్టుకోవడంతో బల్ల ఆంజనేయులుకు బలంగా గాయాలయ్యాయి. అదే మార్గంలో వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారేపల్లి గ్రామ నివాసి దోమ వెంకటేశ్ పరిస్థితులను గమనించి గాయాలైన ఆంజనేయులును వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యం అందించేందుకు ఎవరూ అందుబాటులో లేకపోవడంతో జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్యంకోసం తన సొంతకారులో పంపించారు.

ఉరివేసుకొని రైతు ఆత్మహత్య

నవాబ్‌పేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): చేసిన అప్పులు తీర్చలేక ఓ రైతు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని ఎర్రవాడ్కతండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విక్రం కథనం ప్రకారం... మండలంలోని వెంకటేశ్వర గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రవాడ్క తండాకు చెందిన పాండు భార్య పిల్లలతో కలిసి బతుకుదెరువు కోసం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఉంటున్నారు. ఈనెల 10న ఇంటికి వెళ్లివస్తానని సాయంత్రం 3 గంటలకు పాండు బయలు దేరాడు. ఇదిలా ఉంటే, శనివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో గ్రామానికి చెందిన గోపాల్ అనే వ్యక్తి ఫోన్ ద్వారా పాండు గ్రామ సమీపంలోని వీరాపూర్ మల్లయ్య వ్యవసాయ పొలంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో అక్కడికి వచ్చిన కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తరలించారు. భార్య మంగమ్మ తన భర్త అప్పులతోనే ఆత్మహత్య చేసుకున్నాడని, ఎవరిపై అనుమానం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


శంకరయ్య (ఫైల్)

గోపాల్‌పేట, అక్టోంబరు 11 (ఆంధ్రజ్యోతి): బైక్‌పై నుంచి కిందపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుద్దారం గ్రామనికి చెందిన వడ్డె శంకరయ్య (35) మండలంలో తాపీమేస్త్రీగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నా డు. గత నెల 29న సాయంత్రం రేవల్లి మండలంలోని కేశంపేట గ్రామంలో మేస్త్రి పని ముగించుకొని వస్తుండగా, మధ్య మార్గంలో బైక్‌పై నుంచి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. ఆరోగ్యం విషమంగా ఉండటంతో శంకరయ్యను చికిత్స కోసమని హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రితో చేర్పించారు. 12 రోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం రా త్రి మృతి చెందాడు. శనివారం మృతదేహాని స్వగ్రామానికి తీసుకవచ్చారు. మృ తుడు శంకరయ్యకు భార్య పద్మ, నలుగురు ఆడపిల్లలు ఉన్నారు. ప్రభుత్వం మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శ్రావణ్ కుమార్ పరామర్శించి ఆర్థిక సాయం చేశారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు..


మృతి చెందిన పాడిఆవు

వెల్దండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల పరిధిలోని అల్లంతోటబావి తండాలో ఇస్లావత్ జైపాల్ అనే రైతుకు చెందిన పాడిఆవు విద్యుత్ ప్రమాదంలో మృతి చెందింది. జైపాల్‌కు చెందిన పాడిఆవు తన వ్యవసాయ పొలంలో మేస్తుండగా కిందపడిన విద్యుత్ వైరు తగిలి మృతి చెందింది. ఆవు విలువ సుమారు రూ.లక్షా 20వేలు ఉంటుందని ఈ సందర్భంగా బాధిత రైతు తెలిపారు.

జాతీయ రహదారిపై తప్పిన పెను ప్రమాదం

అలంపూర్ చౌరస్తా, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ 44వ జాతీయ రహదారిపై శనివారం ఒకేసారి మూడు వాహనాలు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్న సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవెల్లి మండల పరిధిలోని ఉత్తరఫుడ్స్ వద్ద శనివారం కర్నూలు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న టీఎస్ ఇన్నోవా కారు ఉత్తర ఫుడ్స్ వద్దకు రాగానే కుక్క అడ్డుగా రావడంతో సడన్ బ్రేకు వేశాడు. అదే వరుసగా మరో నాలుగు కార్లు ఒక గూడ్స్ లారీ వెన్నంటే వస్తుండటంతో ఢీకొన్నాయి. ఈ తప్పిన పెను ప్రమాదంలో ఎవరికి కూడా గాయాలు కాలేదు. పెను ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మహిళను వేధించిన వ్యక్తిపై కేసు నమోదు

వడ్డేపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహిళను వేధించిన వ్యక్తిపై కేసు న మోదు అయిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల గ్రామంలో చోటుచేసుకున్నది. తనగల నుంచి శనివారం చాకలి సత్యమ్మ తన సొంత గ్రామమైన చిన్నధన్వాడ గ్రామానికి నడుచుకుంటూ బయలేరింది. కాగా, మార్గమధ్యంలో తనగల గ్రామానికి చెందిన తిమ్మప్ప అనే వ్యక్తి ఆమెను చూసి సైగలు చేశాడు. దీంతో ఆమె నిలదీయగా కోపోద్రిక్తుడైన అతడు తన దగ్గర ఉన్న చర్నకోలుతో ఆమెను విక్షణరహితంగా కొట్టాడు. ఈ విషయంపై సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ట్లు శాంతినగర్ ఎస్‌ఐ నాగశేఖర్ రెడ్డి తెలిపారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పండుగ

» ఉమ్మడి జిల్లాలో ఒక జాతీయ, ఎనిమిది రాష్ట్రస్థాయి టోర్నీలకు ఆతిథ్యం
» రాజాపూర్‌లో ఈ నెల 18 నుంచి స్టేట్ వాలీబాల టోర్నీ


గత ఏడాది నిర్వహించిన జాతీయస్థాయి అండర్-17 హ్యాండ్‌బాల్ టోర్నీ ప్రారంభ వేడుకలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు అతిథ్యం ఇవ్వడంలో ప్రత్యేక స్థానం ఉంది. తెలంగాణ రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ జిల్లా క్రీడా పోటీల నిర్వహణ అంటే వివిధ జిల్లాల క్రీడాకారుల్లో ఉత్సాహం ఉంటుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ఈ ఏడాది ఒక జాతీయ స్థాయి, 8 రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా టోర్నీలను కేటాయించారు. ఇప్పటికే మండల, జిల్లా, ఉమ్మడి జిల్లా ఎంపికలను ఎంతో ఉత్సాహం నిర్వహించారు. పలు జిల్లాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్లు వివిధ క్రీడా అంశాల్లో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా అండర్-14, 17, 19 జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ చేపట్టనున్నారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించారు. గత ఏడాది జాతీయస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ వాలీబాల్ బాలుర టోర్నమెంట్, ఈ ఏడాది జనవరిలో జాతీయ స్థాయి అండర్-17 విభాగంలో బాల, బాలికల హ్యాండ్‌బాల్ టోర్నీలను విజయవంతంగా నిర్వహించారు.

టోర్నీలను విజయవంతంగా నిర్వహిస్తాం



మహబూబ్‌నగర్ జిల్లాకు ఈసారి మూడు రాష్ట్రస్థాయి టోర్నీలతో పాటు ఒక జాతీయ స్థాయి క్రీడా టోర్నీ కేటాయించారు. టోర్నీలను పీడీ, పీఈటీల సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తాం. ఇప్పటికే ఉమ్మడి జిల్లా జట్లు రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొంటున్నాయి.

- డాక్టర్ శారదాబాయి,
జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ

ఈ ఏడాది 9 టోర్నీల కేటాయింపు...

ఈ ఏడాది జిల్లాలో 69వ జాతీయస్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్ బాల, బాలికల టోర్నీతో పాటు అండర్-14, 17, 19 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ చేపట్టనున్నారు. మొత్తం 9 టోర్నీలు ఉమ్మడి జిల్లాకు కేటాయించారు.

మహబూబ్‌నగర్ జిల్లాలో..

మహబూబ్‌నగర్ జిల్లాలో అండర్-17 బాలికల వాలీబాల్ టోర్నీ ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు రాజాపూర్ మండలం తిరుమలపూర్ జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించనున్నారు. అండర్-17 బాల,బాలికల విభాగంలో క్రికెట్ టోర్నీ, అండర్-19 బాల,బాలికల విభాగంలో హ్యాండ్‌బాల్ రాష్ట్రస్థాయి టోర్నీలు కేటాయించారు.

నాగర్‌కర్నూల్ జిల్లాలో..

నాగర్‌కర్నూల్ జిల్లాకు అండర్-19 బాల, బాలికల మల్కం రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహించనున్నారు.

నారాయణపేట జిల్లా...

నారాయణపేట జిల్లాకు అండర్-19 బాల,బాలికల రెజ్లింగ్ రాష్ట్రస్థాయి టోర్నీ, అండర్-14 బాల,బాలికల హ్యాండ్‌బాల్ స్టేట్ టోర్నీలు కేటాయించారు.

జోగుళాంబ గద్వాల...

జోగుళాంబ గద్వాల జిల్లాకు అండర్-14 బాల,బాలికల బీచ్‌వాలీబాల్ రాష్ట్రస్థాయి టోర్నీ కేటాయించారు.

వనపర్తి జిల్లాకు...

వనపర్తి జిల్లాకు అండర్-17 బాల, బాలికల రాష్ట్రస్థాయి హాకీ టోర్నీకి అతిథ్యం ఇవ్వనుంది.

ప్రమాదవశాత్తు నీట మునిగి
ఇద్దరు సోదరుల మృతి

» చెక్‌డ్యామ్ నీటిలో ప్రమాదం, బలీదుపల్లిలో తీవ్ర విషాదం



నీట మునిగి మృతి చెందిన మంద సుధాకర్,మందసాయి (ఫైల్)

మూసాపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి చెక్‌డ్యామ్ నీటిలో ప్రమాదవశాత్తు మునిగిపోయి ఇద్దరు సోదరులు మృతి చెందిన సంఘటన శనివారం మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం బలీదుపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం వివరాల్లో వెళ్లగా బలీద్‌పల్లి గ్రామానికి చెందిన మంద యాదయ్య, మంద మనెమ్మ దంపతులకు నలుగురు కుమారులు. అందరూ హైదరాబాద్‌లో స్థిరపడి ఆటో నడిపించేవారు. శుక్రవారం తల్లి మంద మనెమ్మ సంవత్సరీకం కోసం గ్రామానికి వచ్చారు. శనివారం తల్లి మొదటి సంవత్సరీకానికి సంబంధించిన పువ్వులను గంగలో కలపడానికి గ్రామ శివారులో ఉన్న చెక్‌డ్యామ్ వద్దకు కుటుంబ సభ్యులందరూ వెళ్లారు. అక్కడ కార్యక్రమాలు పూర్తిచేశాక పెద్ద కుమారుడు మంద సుధాకర్(32)కు చేపలు కన్పించడంతో పట్టుకోవడానికి నీటిలోకి దుకాడు. నీటి ప్రవాహ ఉధృతి తీవ్రం కావడంతో మునిగిపో తుండాన్ని గమనించిన సోదరుడు మంద సాయి (27) రక్షించడానికి నీటిలోకి దూకాడు. అన్నను పట్టుకోవడానికి ప్రయత్నించగా అతడు కూడా మునిగిపోతుండగా మరో సోదరుడు పంచేను నీటిలోకి విసిరి వారిని బయటికి లాగి ఒడ్డుపైకి చేర్చాడు. అప్పటికే మంద సుధాకర్ మృతి చెందగా మంద సాయి పరిస్థితి విషమించడంతో ఇద్దరినీ జిల్లా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మంద సాయి కూడా మృతి చెందాడు. కళ్ల ముందే తమ ఇద్దరు కుమారులు మృతి చెందడాన్ని చూసి తండ్రి యాదయ్యతో పాటు కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడు మంద సుధాకర్‌కు భార్య మమత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మంద సాయికి వివాహం కాలేదు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

పేటలో ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



పథ సంచాలన్ చేస్తున్న కార్యకర్తలు, కార్యకర్తలపై పూలు చల్లి స్వాగతం పలుకుతున్న మహిళలు

» ఆకట్టుకున్న పథ సంచాలన్
» అడుగడుగునా పూలు చల్లి అఖండ స్వాగతం
» సమరసత నిర్మాణమే సంఘ లక్ష్యం
» సంస్కార భారతి ప్రాంత సహకారదర్శి చక్రవర్తి వేణుగోపాల్

నారాయణపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూర్తి గణవేష్‌తో వేలాది మంది కార్యకర్తలు పథ సంచాలన్ (శోభాయాత్ర) పళ్ల హనుమాన్ మందిరం నుంచి శ్రీ గార్డెన్ వరకు నిర్వహించారు. శోభాయాత్రలో సంఘ కార్యకర్తలపై మహిళలు, స్నేహ మిత్ర మండలి సభ్యులు, వివిధ సంఘాల కార్యకర్తలు పూలు చల్లి ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ గార్డెన్‌లో జరిగిన సభలో ప్రధాన వక్త సంస్కార భారతి ప్రాంత సహకారదర్శి చక్రవర్తి వేణుగోపాల్ మార్గదర్శనం చేస్తూ దేశంలో సమరసత భావన నెలకొల్పడమే సంఘం ప్రధాన లక్ష్యం అన్నారు. వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణం చేయడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ జన్మ శతాబ్దిలో భాగంగా రాబోయే రోజులలో ఇంటింటి జన జాగరణ చేపట్టబోతుందని తెలిపారు.

వరలక్ష్మి సరోజ, నగర సంఘ చాలక్ డాక్టర్ మదన్‌మోహన్ రెడ్డితో పాటు స్వయం సేవకులు పాల్గొన్నారు. ముదిరాజ్ సంఘం, స్నేహ మిత్ర మండలి, బలరామ రైతు సంఘం ఘన స్వాగతం పలికారు. రాష్ట్రీయ స్వయం సేవక సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా పథ సంచాలన్ పాల్గొన్న స్వయం సేవకులకు నారాయణపేట ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మెయిన్ చౌక్ వద్ద అలాగే భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో సత్యనారాయణ చౌరస్తాలో పూలతో స్వాగతం పలికారు.

సైబర్ ఉచ్చులో 12.50లక్షలు మాయం

» నాగర్‌కర్నూల్‌లో చోటు చేసుకున్న ఘటన

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మాయగాళ్ల ఉచ్చులో పడి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన శెట్టిపల్లి తిరుపతయ్య 12లక్షల 50వేలు అపహరణకు గురయ్యాయని ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ కాలనీకి చెందిన శెట్టిపల్లి తిరుపతయ్య ఫోన్ వాట్సాప్‌గ్రూప్‌లో ట్రేడింగ్ యాప్‌లో డబ్బులు జమ చేస్తే తక్కువ సమయంలో రెట్టింపు అవుతాయని మేసేజ్ వచ్చింది. దీంతో అతను ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని 12లక్షల 50వేల రూపాయలు జమ చేశాడు. ఆ తర్వాత ఆ యాప్ ఓపెన్ చేసేందుకు ప్రయత్నించగా, కాలేదు. ఆగస్టు 13వ తేదీ వరకు యాప్ నడిచింది. ఆ తర్వాత యాప్ లాక్ కావడంతో సైబర్ క్రైమ్‌లో 1930కు ఫిర్యాదు చేశాడు. దీంతో శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శెట్టిపల్లి తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

జిమ్‌లో దాడి చేసిన
నలుగురు యువకులపై కేసు

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి ప్రధాన రహదారిలో ఉన్న ఒక జిమ్‌లో యువకులపై దాడి చేసిన సంఘటనలో నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఆండ్రెస్ శుక్రవారం రాత్రి అకారణంగా కార్తీక్, అతని స్నేహితులు తరుణ్, కౌశిక్, షరీఫ్‌లతోపాటు మరికొంతమంది దాడి చేశారని ఆండ్రెస్ ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

నెమళ్లకు అస్వస్థత

» కాపాడిన రైతుకు సత్కారం


నెమళ్లను కాపాడిన రైతును సన్మానిస్తున్న పోలీసులు, గ్రామస్థులు

గోపాల్‌పేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో నెమళ్లు అస్వస్థతకు గురయ్యాయి. ఎస్‌ఐ నరేష్ కుమార్, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏదుట్ల గ్రామ పరిధిలో ఉన్న నడిపి గుట్ట దగ్గర గ్రామానికి చెందిన శివ పొలంలో శుక్రవారం రాత్రి పంటలకు పిచికారి చేసే క్రిమిసంహారక నీళ్ల తాగిన నాలుగు నెమళ్లు అస్వస్థతకు గురై నడువలేని పరిస్థితిలో ఉండిపోయాయి. గమనించిన సదరు రైతు సంబంధిత అధికారులకు సమాచారం అందించే ప్రయత్నం చేసినా ఎవరూ అందుబాటులోకి రాలేదు. దీంతో నెమళ్లను తన దగ్గరే భద్రపరిచాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ గిరిధర్‌రావు శనివారం తెల్లవారుజామున పోలీసులకు సమాచారం అందించారు. తక్షణమే ఎస్‌ఐ నరేష్ కుమార్, గ్రామ యువకులు అక్కడికి చేరుకొని నడువడానికి ఇబ్బంది పడుతున్న మూడు నెమళ్లను స్వాధీనం చేసుకొని మండల కేంద్రంలో వెటర్నరీ డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో జిల్లా కేంద్రం పశువైద్యశాలకు తీసుకవెళ్లి అక్కడ వాటికి చికిత్స అందించి ఫారెస్టు అధికారులకు అందజేశామని ఎస్‌ఐ తెలిపారు. నెమళ్లను ఎస్పీ వాటిని పరిశీలించి డాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. నెమళ్లను కాపాడిన రైతు శివను పోలీసులు, గ్రామస్థులు శాలువాతో సత్కరించారు.

150 దేశాల్లో వ్యాపించిన సత్యసాయి ఆధ్యాత్మిక సామ్రాజ్యం

» పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌జే.రత్నాకర్

కల్వకుర్తి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయి ఆధ్యాత్మిక సామ్రాజ్యం 150దేశాల్లో వ్యాపించిందని సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టు పుట్టపర్తి ఆర్‌జే.రత్నాకర్ అన్నారు. డబ్బు కాదు సేవే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణ భగవాన్ సత్యసాయి సేవాసమితి, ట్రస్టు ఆధ్వర్యంలో నిర్మించిన ప్రశాంతి సన్నిధిలో భగవాన్ సాయిబాబా, షిరిడి సాయిబాబా, లక్ష్మీగణపతి, గాయత్రీ మాత అన్నపూర్ణా మాత గోపాలకృష్ణ దశావతార మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శనివారం అట్టహాసంగా జరిగాయి. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే.రత్నాకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్వకుర్తి ప్రాంతంలో విద్యాభివృద్ధికి శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు సహకరించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఉమా మనీలా సంజీవ్‌కుమార్‌యాదవ్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ, వెల్దండ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమాకాంత్‌రెడ్డి, నాయకులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, సత్యసాయి సేవా సంస్థల నాయకులు శంకరయ్య, వెంకట్రావు, సురేష్, సభ్యులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్..

మైనర్లు వాహనాలు నడిపితే.. క్రిమినల్ కేసులు

» జడ్చర్ల సీఐ కమలాకర్



జడ్చర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మైనర్లు, లైసెన్స్ లేని వారు వాహనాలు నడపవద్దని, నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని జడ్చర్ల సీఐ కమలాకర్ హెచ్చరించారు. ప్రమాదాల నివారణలో భాగంగా తీసుకోబోయే చర్యలను 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

మైనర్లు వాహనాలు నడిపితే ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

మైనర్‌లు, లైసెన్స్ లేని వారు వాహనాలను నడపవద్దు. ఎట్టి పరిస్థితిల్లో తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దు. ఇస్తే తల్లిదండ్రులపై సైతం క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

త్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్‌పై చేపట్టే చర్యలు ఏమిటి?

పట్టణంలోని అన్ని ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఉన్నాయి. వీటి ద్వారా నిరంతరం పర్యవేక్షించి, త్రిబుల్‌రైడ్, ర్యాష్‌డ్రైవ్ చేసేవారిని గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధిస్తున్నాం.

డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారా?

పట్టణంలో ప్రత్యేకంగా డ్రంకన్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నాము. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి, జరిమానా విధిస్తున్నాం.

న్యూస్ బాక్స్..

గోశాలకు గోవుల తరలింపు

చిన్నచింతకుంట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలోని కురుమూర్తి స్వామి వారికి భక్తులు సమర్పించిన గోవులను శనివారం హన్వాడ మండలం చిన్నదర్పల్లి శ్రీలక్ష్మి గోశాలకు తరలించారు. ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదేశ్వర్ రెడ్డి, పాలక మండలి సభ్యులు భాస్కరాచారి, కమలాకర్ పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా శ్రమదానం చేయాలి

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛందంగా శ్రమదానం చేయాలని తెలంగాణ విద్యామండలి చైర్మన్ డాక్టర్ బాలకిష్టారెడ్డి అన్నారు. శనివారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లు 1,5,8 ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు రోజుల స్పెషల్ క్యాంప్‌ను పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్‌బాబుతో కలిసి సందర్శించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతీ నెల ఏదైన ఒక శనివారం శ్రమదానం చేయాలన్నారు.

ఆర్థిక సాయం అందజేత

మూసాపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన బోయ నాగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ మండల నాయకుడు ఖాజామైనోద్దీన్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5 వేలు అందజేశారు. నాయకులు నిరంజన్‌గౌరి, సాగర్, నరేష్, కుర్మయ్య, మన్నెంకొండ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆర్థిక సాయం

మూసాపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన శ్రీలక్ష్మి గ్రామాభివృద్ధి సంఘం, పద్మావతి గ్రామ పొదుపు సంఘం సభ్యురాలు నాగమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. బాధిత కుటుంబ సభ్యులను మహిళా సంఘం నాయకురాలు పరామర్శించి రూ.11వేల ఆర్థిక సాయం అందజేశారు. మహిళ సంఘం నాయకురాలు సుశీలమ్మ, పద్మ, అంజమ్మ, లక్ష్మి, వీవోఏ నసీరోద్దీన్ ఉన్నారు.

14, 15 తేదీల్లో జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15వ తేదీల్లో జిల్లా కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారదాబాయి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న అండర్-14 బాల, బాలికల, 15న అండర్-17 బాల, బాలికల జట్ల ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. బోనఫైడ్, ఆధార్, 4 ఎలిజిబిలిటీ పత్రాలతో ఉదయం 9 గంటలకు పీడీ రాజవర్ధన్‌రెడ్డికి రిపోర్టు చేయా లన్నారు.

మనువాదుల కుట్రలో భాగమే సీజేఐపై దాడి

పాలమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడి మనువాదుల కుట్రలో భాగమేనని తెలంగాణ ఉద్యమకారుడు ఎండీ హనీఫ్‌అహ్మద్ పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ భారత అత్యున్నత న్యాయస్థానంపై దళితుడు కూర్చున్నాడనే అక్కసుతోనే సంఘ్ పరివార్ శక్తులు ఇలాంటి అవమానకరమైన కుట్రకు పాల్పడ్డారని తెలిపారు. జస్టిస్ గవాయ్ అత్యున్నత న్యాయ కోవిదుడు, భారత దేశం గర్వించదగ్గ ముద్దుబిడ్డ అన్నారు. దాడికి పాల్పడిన న్యాయవాదికి వృత్తి నుంచి శాశ్వతంగా తొలగించి, దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మరమ్మతుకు నోచుకోని సీతాఫలం యంత్రాలు

» సీజన్ దాటుతున్నా.. పట్టించుకోని అధికారులు

» నష్టపోతున్న మహిళా సంఘాల సభ్యులు



నిరుపయోగంగా ఉన్న సీతాఫలం యంత్రాలు



నవాబ్‌పేటలో విక్రయిస్తున్న సీతాఫలాలు

నవాబ్‌పేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేవలం శీతాకాలంలో నోటికి తియ్యదనాన్ని, ఆరోగ్యానికి కావల్సిన పోషకాలను అందించే సీతాఫలం అంటే అందరికీ ఇష్టమే. పేరుకు కరువు జిల్లా అయిన పాలమూరు సీతాఫలం ఉత్పత్తిలో మాత్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో నవాబ్‌పేట, కల్వకుర్తి, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, అచ్చంపేట, కొల్లాపూర్, నారాయణపేట, కొడంగల్ ప్రాంతాల్లో లభించే సీతాఫలానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా అడవులు, మైదాన ప్రాంతాల్లో లభించే ఈ ఫలాన్ని కర్నూల్, అనంతాపూర్, బెంగళూర్, ఢిల్లీ, రాయిచూర్, విజయవాడ వ్యాపారులు పాలమూరు సీతాఫలం కొనుగోలుకు చేసి ఇతర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. అయితే ఈసారి ముందస్తుగా వర్షాలు కురవడంతో ఒక్కో ఫలం అరకిలో వరకు తూగుతుంది. ఎల్లవేళలా సీతాఫలం మాధుర్యాన్ని ఆస్వాదించేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లాలో నవాబ్‌పేట, దామరగిద్ద మండలాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేశారు. గుజ్జు సేకరణపై పొదుపు సంఘాల మహిళలకు శిక్షణ ఇవ్వగా, గుజ్జును తీసి వ్యాపారులకు విక్రయించి లాభాలు సైతం గడించారు. దీంతో పలువుకి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుందనే సమయంలో ఆదిలోనే హంసపాదులా మారింది. గుజ్జు తయారికి తీసుకుకొచ్చిన యంత్రాలు ఈ సీజన్‌లో పనిచేయకపోవడంతో వాటిపై ఆధారపడిన కటుంబాలకు ఉపాధి కరువైంది. ఈ సీతాఫలం గుజ్జును ముఖ్యంగా ఐస్‌క్రీం తయారి, మిల్క్‌షేక్, జ్యూస్‌కు ఉపయోగిస్తారు. కాగా సీతాఫలం యంత్రాలు పనిచేయడం లేదని, వాటికి మరమ్మతుల చేపట్టాలని సిబ్బంది పలుమారు ఉన్నతాధికారులకు చెప్పినా స్పందించడం లేదని పలువురు మహిళలు వాపోతున్నారు. ఈ విషయమై ఏపీఎం శ్రీహరిని వివరణ కోరగా.. సీతాఫల్ యూనిట్ యంత్రాలు పనిచేయని మాట వాస్తవమేనని, త్వరలో సమస్యను పరిష్కరిస్తామని వివరించారు.

సకాలంలో బియ్యం అందివ్వాలి

» రైస్ మిల్లర్లను ఆదేశించిన అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



రైస్ మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

భూత్పూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : 2024-25 ఖరీఫ్ సీజన్‌లో ప్రభుత్వం నుంచి వరి కొనుగోలు చేసి సీఎంఆర్‌కు అందివ్వాల్సిన బియ్యాన్ని రైస్ మిల్లుల యజమానులు సకాలంలో ఇవ్వాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం మహబూబ్‌నగర్ పరిధిలోని నవాబుపేటలో గల కనకదుర్గా రైస్ మిల్లు, బోయపల్లిలోని సురేష్ రైస్‌మిల్లు, భూత్పూర్‌లోని భానురైస్ మిల్లు, అడ్డాకులలోని లక్ష్మి నరసింహ, గండీడ్‌లోని శ్రీరామ రైస్‌మిల్లు, మహ్మదాబాద్‌లోని బాలాజీ రైస్ మిల్లును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రైస్ మిల్లుల యజమానులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి సరఫరా చేయాల్సిన రైస్‌ను ఆడించి త్వరిగతిన పూర్తి చేసి సీఎంఆర్‌కు అందివ్వాలని ఆదేశించారు. ఆయా మండలాల పరిధిలో ఉన్న రైస్ మిల్లులను తహసీల్దార్లు తనిఖీ చేసి, బియ్యం అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యనే ఆయుధం

మహమ్మదాబాద్ : విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే విద్యనే ప్రధాన ఆయుధమని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని నంచర్లలోగల షెడ్యూలు కులాల బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేసి, విద్యార్థులతో మాట్లాడారు. ఉన్నత స్థాయికి ఎదిగి మరో నలుగురికి తోడ్పడాలని కోరారు. వసతి గృహంలో వంటగది, కూరగాయలు, నిత్యావసర సరకులను పరిశీలించి విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, భూ భారతి, దరఖాస్తులను పూర్తిచేయాలని ఆదేశించారు.

రిజర్వేషన్ అమలు చేయకుంటే ఉద్యమం ఉధృతం



తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న నాయకులు

పాలమూరు, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : చట్టబద్ధతతో కూడిన 42శాతం రిజర్వేషన్లు బీసీలకు అమలు చేయకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూరుగుపల్లి కృష్ణయాదవ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టి, మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ దళపతి, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పిలుపు మేరకు 14న తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవిందస్వామి, బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవటంతోనే చెల్లని జీవో తెచ్చి కోర్టు స్టే ఇవ్వడానికి అవకాశం కల్పించారన్నారు. బీసీ రిజర్వేషన్ల పై 16వ తేదీన ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. బీసీ డిక్లరేషన్ అమలు చేయటమా? ముఖ్యమంత్రి రాజీనామా చేయటమా? బంతి రేవంత్‌రెడ్డి కోర్టులోనే ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా బీసీ కుల సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీయూ అధ్యక్షుడు తాయప్ప, సురభి విజయ్‌కుమార్, శివాజీ, శ్రావణ్‌కుమార్, నరేందర్, రవి, రాజేందర్, నవీన్, రామకృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

మహ్మద్ ప్రవక్త బోధనలు ఆదర్శం



ప్రవచనం చేస్తున్న సయ్యద్ ముస్తాఫా ఖాద్రీ

భూత్పూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : అల్లా చివరి దూత మహ్మద్ ప్రవక్త అని, ఆయన బోధనలు ప్రపంచ మానవాళికి ఆదర్శమని ప్రముఖ ధార్మిక వేత్త హజరత్ ముస్తాఫా ఖాద్రీ అన్నారు. శుక్రవారం రాత్రి మునిసిపాలిటీలోని మజీద్‌లో ముస్లిం సోదరులకు మహ్మద్ ప్రవక్త యొక్క బోధనల గురించి వివరించారు. ఆయన పుట్టిన రోజును ప్రపంచమంతా గ్యార్వీ వేడుకలుగా జరుపుకుంటారన్నారు. హజ్రత్ గౌసే ఆజామ్ ఇస్లాం అభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. అదే విధంగా ప్రతీ మనిషి తన నిజ జీవితంలో ఎలా ఉండాలి? దాన, ధర్మ గుణంతో ఏ విధంగా మెలగాలి అనే విషయాలు వివరించారు. ఆపదలో ఉన్న తోటి వారిని కులం, మతం అనే భేదం లేకుండా అందరం ఒక్కటేనన్న భావనతో మెలిగితేనే ఈ సృష్టి అర్థం ఉంటుందన్నారు. మజీద్ కమిటీ అధ్యక్షుడు బాబాషర్పోద్దీన్, కార్యదర్శి అహ్మద్, మత పెద్దలు మహ్మద్ కాశీంఖురేషి, ఎండీ. జాంగీర్, నయ్యూం, అబ్దుల్ ఖుద్దూస్, ఇబ్రహీం, శబ్బీర్, అక్తర్ ఖాద్రీ పాల్గొన్నారు.

నేర రహిత జిల్లాగా మార్చుకుందాం



అవగాహన కల్పిస్తున్న పోలీసు సురక్ష కళాజాత బృందం, షీ టీం బృందం సభ్యులు

జడ్చర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్‌ను నేర రహిత జిల్లాగా మారుద్దామని షీ టీం బృందం సభ్యురాలు ఏఎస్‌ఐ జయరాణి అన్నారు. మండలంలోని చిట్టబోయిన్‌పల్లిలోని తెలంగాణ సాంఘిక, సంక్షేమ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలలో శనివారం ప్రజా భద్రత - పోలీసు బాధ్యత అనే అంశంపై సామాజిక అవగాహన కార్యక్రమాన్ని సురక్ష పోలీస్ కళా బృందం - షీటీం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు విలువలతో కూడిన జీవనం గడపాలన్నారు. సైబర్ నేరాలు, మోసపూరిత లింకులు, మెసేజ్‌లకు స్పందించవద్దని వెల్లడిస్తూ, వారి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మత్తు పదార్థాలు జీవితాన్ని నాశనం చేస్తాయని, వాటి జోలికి పోవద్దన్నారు. మత్తుపదార్థాల తయారీ, సరఫరా, రవాణా, అమ్మకాలం సమాచారం తెలిస్తే కంట్రోల్ రూంకు సమాచారం ఇవ్వాలని సూచించారు. బాల్యవివాహలు చేయవద్దని, అలాంటి సందర్భంలో చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇవ్వాలన్నారు. షీ టీం హెడ్ కానిస్టేబుల్ అరుంధతి, కానిస్టేబుల్ రజిత, కళా బృందంలో హెడ్ కానిస్టేబుల్ రాములు, పాఠ శాల ప్రిన్సిపాల్ అనిత పాల్గొన్నారు.

నేడు తాగునీటి సరఫరా బంద్

మహబూబ్‌నగర్ న్యూటౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థకు తాగు నీటిని సరఫరా చేసే ధర్మాపూర్ గ్రామం వద్ద పైప్ లీకేజీ కారణంగా నగరంలో ఆదివారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరా తిరిగి సోమవారం పునురుద్ధరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు అధికారులకు, సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రేపటి లోగా దరఖాస్తు చేసుకోవాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : టాస్క్ రీజనల్ సెంటర్‌లో ఉద్యోగాల కోసం బీటెక్, డిప్లొమా, బీఎస్సీ, ఎమ్మెస్సీ తదితర కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 13వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని టాస్క్ రీజినల్ ఇన్‌చార్జి సతీష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలోగల టాస్క్ సెంటర్‌లో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు టాస్క్ సెంటర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రతిభా పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గౌడ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల అసోషియేషన్ ఆధర్యంలో 2025 సంవత్సరం గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తూర్ వెంటస్వామి గౌడ్, యాదగిరి, రాజయ్యగౌడ్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీయట్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులు, ఎంబీబీఎస్, ఐఐటీ, గ్రూప్-1 గ్రూప్-4లో ఉద్యోగాలు సాధించిన వారు, వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారు ఈనెల 20 లోపు దరఖాస్తు చేసుకోవలన్నారు.

ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ



సంతకాల సేకరణలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మూసాపేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఓటు చోరీ విధానానికి వ్యతిరేకంగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు శనివారం అడ్డాకుల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో వంద మంది వరకు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీహరి, జిల్లా కార్యదర్శి విజయ మోహన్‌రెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యుడు షఫీ అహ్మద్, సీనియర్ నాయకులు బి.దశరథ రెడ్డి, వేగనాథ్, శేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాములు, జగదీష్, ప్రేమ్, దేవూజీ ఉన్నారు.

నేడు డీసీసీ కమిటీపై అభిప్రాయ సేకరణ

మహబూబ్‌నగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : డీసీసీ కొత్త అధ్యక్షుల నియామకం కోసం కాంగ్రెస్ పార్టీ కసరత్తు చేస్తుంది. అందులో భాగంగా మహబూబ్‌నగర్ డీసీసీ అధ్యక్షుడి కోసం అభిప్రాయ సేకరణ కోసం ఇన్‌చార్జిగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే గణేష్‌ను పార్టీ అధిష్టానం నియమించింది. దీంతో శనివారం సాయంత్రం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన ఆర్‌అండ్‌బీ అతిథిగృంలో డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డితో సమావేశం అయ్యారు. ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశం కానున్నారు. నూతన డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం అభిప్రాయ సేకరణ కోసం తేదీలను నిర్ణయించనున్నారు. ఏఐసీసీ సభ్యుడు నారాయణస్వామి, రాష్ట్ర మత్స్య శాఖ చైర్మన్ మెట్టసాయి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుందాం

జడ్చర్ల, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాదేపల్లి బాలుర జడ్పీహెచ్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహించుకుందామని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బాదిమి రవిశంకర్ పిలుపునిచ్చారు. జడ్చర్ల మునిసిపాలిటీని చంద్రాగార్డెన్స్‌లో శనివారం శతాబ్ధి ఉత్సవాల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొని, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాదిమి రవిశంకర్ మాట్లాడుతూ నవంబరు 27, 28, 29 తేదీల్లో శతాబ్ధి ఉత్సవాలు నిర్వహించేందుకు ఇప్పటికే నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. ఈ ఉత్సవాలకు ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ముగింపు రోజున సంగీత విభావరి ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ఉత్సవాలకు పూర్వ విద్యార్థులంతా అత్యధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు, పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి : కలెక్టర్



ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

నవాబ్‌పేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శనివారం మండలంలోని రుద్రారం, యన్మనగండ్ల గ్రామాలను తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించి, మాట్లాడారు. రుద్రారం గ్రామంలో మొన్న కురిసిన భారీ వర్షానికి ఇళ్లలోకి వరద నీరు రావడం, ప్రజలు పడిన ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో ప్రభుత్వం పేదలకు అందిస్తున్న బియ్యం వివరాలు రేషన్ డీలర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం యన్మనగండ్ల బీసీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించారు. ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వార్డెన్ నీళ్ల చారు పెడుతుందని విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకరాగా, వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం యన్మనగండ్ల గ్రామ పెద్ద చెరువు సందర్శించి ప్రమాద స్థలాలకు ప్రజలు రాకుండా చూడాలని తహసీల్దార్ శ్రీనివాస్‌కు సూచించారు. గ్రామంలోని కొత్త ప్లాట్‌లలో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ లబ్ధిదారులు భీమయ్య, భవానితో ఇంటినిర్మాణంపై మాట్లాడారు. త్వరగా నిర్మించుకోవాలని ఏమైన ఇబ్బందులంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

ప్రతీ ఒక్కరు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

భూత్పూర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు క్రమశిక్షణతో మెలిగితే సమాజం అతన్ని గౌరవిస్తుందని న్యూఏర టాలెంట్ పాఠశాల కరస్పాండెంట్ వెంకటక్రాంతి కుమార్ పేర్కొన్నారు. శనివారం భూత్పూర్ మునిసిపల్ కేంద్రంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సేవకులు పథ సంచలన్ కార్యక్రమాన్ని చేట్టారు. ఈ సందర్భంగా న్యూ ఏర టాలెంట్ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ ప్రచారక్ దేవేంద్ర రాజు వక్తగా హాజరై, మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా దేశవ్యాప్తంగా విజయ దశమి వేడుకల్లో భాగంగా ప్రతీ మండలంలో, ప్రతీ గ్రామంలో ఆర్ఎస్ఎస్ పథ సంచలన్ ద్వారా ప్రజలకు మంచి సందేశాన్ని ఇవ్వడం జరుగుతుందన్నారు. 1925లో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు డాక్టర్ కేశవ బలిరామ్ పంత్ హెడ్గేవార్ క్రమశిక్షణ విధానాన్ని అలవర్చుకోవాలన్న ఆలోచనతో ఆర్ఎస్ఎస్‌ను స్థాపించారన్నారు. ఆయన ఆశయ సాధనకు మనవంతుగా ఎవ్వరికీ హాని తలపెట్టకుండా సమసమాజం కోసం పాటుపడాలన్నారు. ఆర్ఎస్ఎస్‌లో సేవలు అందించిన వారు దేశంలో ఎక్కడైనా సేవలు చేయడానికి సంసిద్ధులు అవుతారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

గండీడ్ అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నాయపల్లి తండాకు చెందిన పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు శనివారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి పలువురు కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో మద్దూరు వెంకటయ్య, నగేష్, చిన్న అంజిలయ్య, పెద్ద అంజిలయ్య, సురేష్, రమేష్, కర్ని వెంకటయ్య, కర్ని రమేష్, మాల కృష్ణ ఉన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి, పీసీసీ సభ్యులు నర్సింహరావు, వర్కింగ్ ప్రసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకన్న గౌడ్, దుర్గానాయక్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి సేవలు చిరస్మరణీయం



నర్సింహారెడ్డి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

బాలానగర్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ అభివృద్ధికి దివంగత నాయకుడు నర్సింహారెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయం అని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండెడ్‌లో శనివారం మాజీ సర్పంచు నర్సింహారెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆది రమణారెడ్డి, సందీశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సొంతింటి కల సాకారం

గండీడ్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం అవుతోందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని సల్కర్‌పేట గ్రామంలో 10 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందజేసి, మాట్లాడారు. ఏ గ్రామానికి వెళ్లినా గంతంతో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లే కనిపిస్తాయని, పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమేష్, నాయకులు నర్సింహరెడ్డి, బసప్ప, రాములు, శేఖర్, వెంకటేష్ పాల్గొన్నారు.

రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ

నవాబ్‌పేట, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) : నూనె ఉత్పత్తుల పంటల విస్తీర్ణం పెంచాలని ప్రభుత్వం రైతు సహకార సంఘంలోని సభ్యులకు ఉచితంగా వేరుశనగ అందజేస్తోందని మార్కెట్ చైర్మన్ హరలింగం పేర్కొన్నారు. శనివారం మండలంలోని కొల్లూర్ రైతు వేదికలో వైస్ చైర్మన్ తులసీరాంతో కలిసి రైతులకు వేరుశనగ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీరటి రాంచంద్రయ్య, వాసుయాదవ్, ఖాజ, సున్నాల కృష్ణయ్య, రవీందర్‌రెడ్డి, నాగ ఆంజనేయులు, రమేష్‌గౌడ్, అనంతయ్య పాల్గొన్నారు.